ఒట్టు

కనుపర్తి వరలక్ష్మమ్మ

౧

బందరులో క్రొత్తగా యేర్పడిన నాట్యకళోద్ధారకసమితివారు ఒకనాడు సమావేశమై తమ సమితిపక్షాన యికముందు ఆడబడే నాటకాల్లో స్త్రీలే స్త్రీపాత్ర ధరించాలెనని తీర్మానించారు. ఈతీర్మానం మొట్టమొదట ధైర్యంతో ప్రవేశబెట్టి అడ్డుప్రశ్నలన్నిటికీ సమాధానాలు చెప్పి నెగ్గునట్లు చేసినవాడు జగన్నాథం. జగన్నాథం ప్రతిపాదన నెగ్గగానే శర్మ మఱిఒక వేడివేడి తీర్మానం ఉపపాదించాడు. ఏమనీ? స్త్రీలుఅభినయించాలె అనడం వట్టితీర్మానమేగాకుండా క్రియారూపంగా చూపుటే సమితివారి ముఖ్యాశయం గనుక మూడుమాసాల్లో సమితిసభ్యులు యావన్మందీ తమస్త్రీలచే నాటకభాగాలు వల్లింపజేసి వచ్చేవేసవి సెలవులలో తప్పకుండా మూడునాటకాలు ఆడితీరాలె; అని. ఈతీర్మానం గెలవడానికి పెటపెటలైంది. నా భార్య పసిబిడ్డతల్లి అనీ, నాభార్య పురిటికెళ్లిందనీ, మాఆవిడకు ఒంట్లోసుస్తీగా ఉంటున్నదనీ, ఇంట్లో ఆడవాళ్ల అభిప్రాయం కనుక్కోకుండా యిటువంటి తీర్మానాలు చేయడం తప్పనీ, నేను ఒప్పుకున్నా పెద్దలు మానాన్నగారున్నారు వారు ఒప్పుకోరనీ, మాకు ఘోషా అనీ, మాఆడవాళ్లకు చదువు రాదనీ, యేవేవో కారణాలతో చాలామంది వ్యతిరేకించారు. ఓటులుతీసుకుంటే అనుకూలురు, ప్రతికూలురు సమానమైనారు. అధ్యక్షపీఠం వహించిన అనంతాచార్యుల వారి తలయూపుతో తీర్మానం నెగ్గింది. కర్తవ్యం యేమిటని మనస్సుల్లో వితర్కించుకుంటూ సభ్యులు యిండ్లకు చేరుకున్నారు.

౨

ఆనాటిరాత్రి సమితిసభ్యులు తమతమయిండ్లలో భార్యలతో యీవిషయం ప్రస్తావించారు. నడురేయివఱకూ యింటింటావాదోపవాదాలు జరిగినవి. రెండవతీర్మానం ప్రవేశపెట్టిన శర్మ భార్య యీవిషయంలో భర్తను పూర్తిగా తిరస్కరించింది. "కళోద్ధారణ మంటూ ఉద్యోగం సద్యోగం మానుకొని యింట్లో భార్యాబిడ్డలను యేడ్పించి మీరు తిరుగుతున్నదిగాక యింకా నన్నుగూడా నాటకాలాడడానికి రమ్మంటున్నారా? ఏమైనాసరే, ఆవేషాలూ గీషాలూ నాచేతగావు. మగవాళ్లు భార్యాభర్తలుగా గూడి ఆడుతుంటేనే నాకు సిగ్గుగా ఉంటుంది. అటువంటిది నేనా వేషమేయడం? అయినా ఈనలుగురుబిడ్డల్నీ యెవరిపరం చేసి వెళ్లేది? ఒకపిల్ల మంచినీళ్లంటూ నిశిరాత్రివేళ లేస్తుంది. ఒక పిల్ల వాకిట్లోకి పోతానంటుంది. ఈపసివాడికి తెల్లవారేలోపల రెండుమాట్లూ పాలుగలిపి పొయ్యాలె" అన్నది భార్య.

"పిల్లల విషయం నీ కక్కర్లేదు. మనిషిని పెడ్తా" నన్నాడు శర్మ.

"కూలిమనిషి మనం దగ్గరలేకపోతే పిల్లల్ని బాగా చూస్తుందా?"

"నే నున్నానుగా?"

"మిమ్మల్ని బిడ్డలను చూడమని యింట్లో ఉంచి నే నెవడితోనో జతగూడి నాటకాలాడేది. ఎంత ముచ్చటగా ఉందండీ మీమాట!"

"అయితే ఏమి చేయమంటావు?"

"ఆసమితిసభ్యత్వము వదులుకోండి."

"అంతకంటే శిరచ్ఛేదం లేదు."

"మగవాళ్లతో వేషాలేయడం నాకూ శిరచ్ఛేదమే."

"అయితే నామాట వినవూ?"

"నన్ను క్షమించండి. విషంపుచ్చుకొని ప్రాణాలు విడువమంటే విడుస్తా. కాని ఆనాటకాల్లో వేషాలేయ లేను. నన్నెందుకు దుఃఖపెడ్తారు." అని పెనిమిటి పాదాలమీద బడి భోరున యేడ్చింది ఆమె. శర్మ తెల్ల బోయినాడు.

3

నాయుడుగూడా తన భార్యతో యీవిషయం ప్రస్తావించాడు. "ఇప్పటికే మన కులంవాళ్లు మనకు ఘోషా లేదనీ, నాటకాలకూ సభలకూ పోతుంటా మనీ, సూటీలుపోటీలు అంటున్నారు. ఇక దీనిలో గూడా దిగితిమా నలుగురిలో తలెత్తలేము. ఆడపిల్లలు కలవాళ్లం, ప్రతిదానిలో విచ్చలవిడిగా జొరబడితే పిల్ల లకు సంబంధాలు రావు. అయినా నా వానాకాలపు చదువు మీ రెఱుగరూ? పొడిముక్కలే కూర్చి చదువ లేను; నాటకపద్యాలు నావశమా?" అన్నది నాయుడు భార్య. నాయుడు ఊరుకున్నాడు. ఇంటింటా ఇట్లాగే మగవాళ్లు అడగడం, ఆడవాళ్లు "మావల్ల గా"దనడం జరిగిపోయింది. మొత్తంమీద ఏసభ్యుని భార్యా ఈవిషయం ఆమోదించలేదు. జగన్నాథం మళ్లో యెత్తేశాడు. ఏమంటే అసలుసంగతి భార్య యైన జానకితో ముందుగా చెప్పలేదు. రాత్రిభోజనా లైనతరువాత ఆమెయిల్లు సద్దుకొని పక్కలువగైరాలు చూచుకొని స్తిమితంగా తములపాకులపాందాను దగ్గిఱ పెట్టుకొని కొంచెం వక్కపొడి పెనిమిటి కిచ్చి కొంచెం తాను నోట్లో వేసుకొని ఒక ఆకుకు సున్నం రాచి పెనిమిటి కిస్తూ, ఒక ఆకు తాను వేసుకుంటూ ఉల్లాసం గా ఏమిటో ముచ్చటిస్తూ ఉండగా, జగన్నాథం

" జానకీ, నే నోపని చెప్పుతాను చేస్తావా ?" అన్నాడు.

" ఏపని ?"

" ఏదోపనీ, చేస్తావా? "

" చేస్తానులే చెప్పండి."

" లే, అంటున్నావే; చెయ్యవేమో ?"

" చేస్తానంటేనిగా సంగతి చెప్పందే శంకిస్తే ఎట్లా ?"

" శంకగా పలికితే శంకించాను."

"శంకా లేదు, గింకా లేదు తప్పకుండా చేస్తాను. మీరేమంత చేయరానిపని చేయమనరుగదా."

"............................"

" ఎప్పుడైనా మీ ఆజ్ఞ అతిక్రమించానా, ఇప్పుడు అతిక్రమించడానికి ?"

" అయితే ఒట్టేనా ?"

" ఏం ఒట్టు ?"

" నన్ను చంపుకున్నట్టేనా ?"

" అబ్బా ! అబ్బా! ఏమిటండీ మీ మాటలు ? ఒట్టుపెట్టుకోడానికి యింతకన్నా ఏమీ దొరకలేదు." జానకికన్నుల్లో నీళ్లు గిఱ్ఱున దిరిగాయి.

"..............................."

"ఏమీ మీ కింకా నమ్మకం కలుగలేదూ ? ఈశ్వరసాక్షిగా చేస్తా. ప్రమాణపూర్తిగా చెప్పుతున్నా. ఎంతకష్టమైనా దీనికి తప్పను సరేగదా."

"..............................."

" ఏదీ మీచెయ్యి యిట్లా చాపండీ." అని జానకి లేచి పడక కుర్చీలో కూర్చొని ఒడిలో చేతులు పెట్టుకొని యున్న భర్తచేతిని తానే అందుకొని "మీరు చెప్పినట్లు చేస్తాను." అని చేతిలో చెయ్యేసి "ఏమి మీశంక యిక తీరిందా? ఇక యేమిచెయ్య మంటారో చెప్పండీ" అని పెనిమిటివంక చూచి నవ్వింది.

జగన్నాథానికి నోట మాటరాలేదు. సుప్రసన్న మైన అతని ముఖం దీనాతిదీనంగా అయిపోయింది. "ఎంత విశ్వాసమును, ఎంత ప్రేమను వెల్లడింపజేస్తున్నవి జానకిమాటలు. దానికి ప్రతిగా ఆమెయెడ నేను ఇటువంటి వంచనకు పూనుకొని ఈవిశుద్ధప్రేమ మయిని ఎంతమోసం చేస్తున్నాను. నేను చెప్పబోవు

సమాచార మామె కింత హృదయభేదకమోగదా. ముందుగానే ఆమెస్వేచ్ఛకు శృంఖలలు తగిలించితిని గదా. ద్రోహిని; సతీద్రోహిని." అనితలచి లజ్జితుడై దుఃఖితుడై కుప్పలుకూలినట్లయి జానకికి జబాబుచెప్పకుండానే కుర్చీకి చేరగిలబడ్డాడు జగన్నాథం. పెని



“ఏమి మీ శంక యిక తీరిందా?
ఇక యేమిచెయ్యమంటారో చెప్పండీ?”

మిటిముఖపైవర్ణ్యం జానకికి భీతిగొలిపింది. గడగడ వణికిపోయింది. కన్నులు చెమ్మగిల్లినాయి. ఆతని ముఖంలో ముఖం బెట్టి తటాలున వంగి చూచి “ఏమి యిట్లా ఉన్నా"రే మని ఆదుర్దాగా అడిగింది. ఈలోపల జగన్నాథంలోగూడా కొంతమార్పు గలిగింది. “ప్రారంభవిద్యమొదలుకొని ప్రణయవ్యవహారాలవఱకు స్త్రీలకు స్వాతంత్ర్యం చవిచూపాలనే మతంవాడిని గదా నేను. ఈమాత్రపు సంస్కారానికే యింత బేలతనం చూపితే యెట్లా? ముందుగా చెప్తే యే స్త్రీగూడా ఒప్పుకోదు. కాబట్టి కొంత మోసం, కొంతఅధికారం ప్రయోగించైనా వాళ్లకు స్వేచ్ఛ నేర్పాలె. ఇందులో అక్రమం లేదు." అని అతనికి తోచింది. కొంచెం ధైర్యం తెచ్చుకున్నాడు; కంఠం సవరించుకొన్నాడు; ‘జానకీ’ అన్నాడు.

“ఆఁ.”

“ఈరోజున మా సమితిలో ఒక తీర్మానం ప్యాసుచేశాము.”

“ఏమనీ?”

“ఇకముందు మాసమితిపక్షాన ఆడబడే నాటకాల్లో స్త్రీపాత్రను స్త్రీలే అభినయించాలెననీ, ముందుముందు సమితి సభ్యులే తమస్త్రీలచేత యీసంస్కారం ఆరంభింపజేయాలననీ, వచ్చేవేసవి సెలవులలో మూడునాటకా లిట్టివి ఆడాలననీ.”

“అయితే?”

“ఆతీర్మానంప్రకారం నాభార్యవైన నీవు నాటకభాగాలు వల్లించి నాటకఖేలనంలో పాల్గొనాలె.”

“ఇటువంటి అసభ్యపు తీర్మానాలు చేస్తుంటే ఆసమితితో సంబంధం వదులుకోకపోయినారా?”

“అసలు యీ తీర్మానం ప్రవేశపెట్టినవాడనే నేను.”

“మీ ఉద్దేశం?”

“కళాపోషణ.”

“అయినా పాత్రధారణ ఐచ్ఛికమేగా! ఇష్టం లేనివాళ్లను బాధించదుగదా!”

“ఐచ్ఛికమనడానికి వీలులేదు.”

"అయితే మీరు నాకు ముందే చెప్పలేదేమి?"

"నీవు ఆమోదించవనే."

"అయితే నన్ను మోసంచేశారు."

"నిజమేకాని దురుద్దేశంతో గాదు, కళాభిమానంతో."

"సరేగాని నాయకపాత్రం మీరు ధరిస్తారా?"

"నాకు కంఠసారస్యం లేదు. నాయకపాత్రధారణకు తగను. నీవు మృదుమధురగాత్రవు. నీవాక్పాటవమూ, నీకంఠమాధుర్యమూ, నిన్ను ఉత్తమనాయికాపాత్రకు అర్హురాలినిగా జేయును. కాబట్టి ఆపాత్రకు అర్హుడగు నాయకునితో కలిసి నీవు అభినయించాలె."

"ఏమిటీ, పరపురుషునితోనా?"

"అవును"

"అయ్యో ఎంతమోసం చేశారండీ." అని జానకి గుండెకొట్టుకున్నది.

"అయితే అభినయించవూ?"

"ఎట్లా అభినయించకమాననూ? ఆఒట్టూ, యీ ఒట్టుగాదే, నాప్రాణంమీదనేఒట్టుపెట్టారుగా! మీకంటే నాకధిక మేమున్నది?"

జానకి కళ్లవెంట నీళ్లొచ్చాయి. పమిటచెఱుగుతో తుడుచుకొని తలవంచుకొని క్రిందు చూస్తూ ఉండిపోయింది. తన మోసకృత్యానికి తనలోతానే కుమిలిపోయినట్లయినాడు జగన్నాథం. నాలుగైదునిమిషాలు నిశ్శబ్దంగా గడచిపోయినాయి.

"అయితే పిల్లగ" తేమిటన్నది జానకి దుఃఖంతో, పెనిమిటివంక చూస్తూ.

"వాళ్ల సంగతి నేను చూచుకుంటా" నన్నాడు జగన్నాథం తలవంచుకునే.

జానకి పెద్దనిట్టూర్పు విడిచి "అయినదేమో అయింది. నేను మీఒట్టులో కట్టుబడ్డాను. మీరు నాకు మూడువరా లివ్వాలె."

"ఏమిటని?"

"రిహార్సల్సుకు రాను. ఊళ్లో అభినయించను. మీరూ, పిల్లలూ వెంటరాకుండా పొరుగూళ్లు పోను."

"సరే."

౪

సమితివారి మఱునాటిసభలో సభ్యు లెల్లరు తమభార్యలు రామన్నారనీ, వాళ్లు రావడం తప్పనిసరైతే తాము సభ్యత్వమే వదులుకుంటామనీ, తమ అసమర్థతను వెల్లడించారు. జగన్నాథం ఒక్కడే తాను చేసిన ద్రోహం చెప్పకుండా తనభార్య పాత్రధారణ చేయడానికి ఒప్పుకున్నదని చెప్పి మిత్రుల అభినందనా లందుకున్నాడు. నాయికాపాత్రధారణ చేయగల యువతీమణి దొరికిం దనగానే సభ్యులలో నవోత్సాహం ఉత్పన్నమైంది. మొదట తామనుకున్న ప్రకారం సావిత్రీ, పాదుకాపట్టాభిషేకమూ, సారంగధరా అనే మూడునాటకాలు వరుసగా బెజవాడ, ఏలూరు, రాజమండ్రిపట్టణములలో ప్రదర్శించుటకు తీర్మానించుకున్నారు. ఆమఱునాడే నాటకంపార్టులు జానకిసన్నిధికి చేరినవి. "నాభర్తఆజ్ఞ నాకు శిరోధార్యం. పతివ్రతాతిలకమగు సుమతి కుష్ఠురోగియగు పెనిమిటిని శిరమున నిడుకొని వేశ్యాంగనాగృహమునకు గొనిపోయినదట. అట్లాగే నేనుగూడా నాభర్తఆజ్ఞను నిర్వహిస్తాను" అని జానకి మనస్సులో దృఢనిశ్చయం చేసుకొని నాటకభాగా లందుకున్నది. తన అభీష్టం నెరవేర్చడానికి భార్య అంగీకరించినందుకు మహా సంతోషించాడు ప్రొఫెసర్ జగన్నాథం, యం. ఏ., యల్. టి.

౫

వేసవిసెలవులు యివ్వగానే సమితివారు నాటకాలాడటానికి తట్టాబుట్టా కట్టుకొని బయలుదేరారు. వారితోబాటు సకుటుంబంగా జగన్నాథంగూడా బయలుదేరాడు.

బెజవాడలో యేర్పాట్లన్నీ జరిగాయి. వాల్‌నోటీసు లంటించారు. ఊళ్లో మేళతాళాలతో కాగితాలు పంచారు. తనపేరూ, భార్యపేరూ, చేర్చి

పెద్దపెద్దఅక్షరాలతో ముద్రించబడిన నోటీసులు చూచి జగన్నాథం ఏమనుకున్నాడోగాని జానకి చాలా మన స్తాపం చెందింది. ఎచ్చటనో ఉన్నచోటు యెఱుక బడకుండా ఉండే తన్ను యీవిధంగా గోడలమీదా, గొబ్బెలమీదా, జట్కాబండ్లమీదా, రోడ్డుపక్కనున్న చెట్లమీదా ప్రకటనచేయిస్తున్న తన భర్త యొక్క ఉద్దేశ మేమిటో ఆమె తెలుసుకోలేక పోయింది. కాని తనభర్త నావిషయమై యేమీ అడగ లేదు.

రాత్రి యెనిమిదిగంటలయ్యేటప్పటికి టిఫిన్ క్యారియరుతో అన్నం వచ్చింది. పెనిమిటికీ, బిడ్డకూ అన్నంబెట్టి తానుగూడా తిని పిల్లవాడి నెత్తుకొనే అచ్చికిగూడా అన్నంపెట్టింది. బాబు అప్పటికే నిద్ర బోతున్నాడు. అన్నం పెట్టగానే లీలగూడా నిద్ర బోయింది. తనపనులన్నీ అయినతరువాత జానకి బాబును లేపి పాలిచ్చింది. పిల్లవాడిని యెత్తుకునే అచ్చితో “అచ్చీ! అబ్బాయి లేస్తే లేచి వలఉయ్యాలలో పడుకోబెట్టి ఊపు” అని చెప్పింది. “అమ్మాయి లేచి యేడిస్తే బిస్కట్లు బ్యాగ్‌లో ఉన్నాయి యివ్వండి. వేడినీళ్లు ఫ్లాస్కులో ఉంచాను. పిల్లవాడు లేచి పాల కేడిస్తే ఆవేడినీళ్లతో కలిపిపట్టండి మఱచిపోయి చన్నీళ్లలో కలిపేరుసుమండీ! బిడ్డకు జబ్బుచేస్తుంది. అసలే వాడికి పోతపాలు అలవాటు లేదు. ఏమితాగుతాడో యేమో” అన్నది భర్తతో. భార్యచెప్పిన పాలడబ్బీలు బిస్కట్లు వగైరాలు యెక్కడెక్కడ ఉన్నవో చూచుకుంటున్నాడు జగన్నాథం. ఇంతలో వాకిట్లోకి కారువచ్చిన శబ్దం, తోడనే హారన్ మ్రోగించిన ధ్వని వినబడ్డది. జానకిని పిలుచుకొనిపోవడానికి కారు వచ్చిందికాబోలు ననుకొని జగన్నాథం కొంచెం చకితుడై నిలబడ్డాడు. ఒకమనిషి కారుదిగివచ్చి “నాటకం ఆరంభించపోతున్నారు. అమ్మగారిని పిలుచుకరమ్మన్నా” రన్నాడు జగన్నాథంతో. జానకి అవతలగదిలో పిల్లవాడిపక్క చూస్తున్నది. జగన్నాథం భార్యవద్దకు బోయి “జానకీ, కారువచ్చింది. సిద్ధంగా ఉన్నావా?” అన్నాడు.

జానకి సిద్ధమే అనలేదు. కాని యిట్లా జబాబిచ్చింది. “మాంత్రికుడు సర్పమును కట్టుకట్టి నిల్పినట్లు నన్ను మీఒట్టుతో బంధించారు. మనమిరువురమూ నాయికానాయకులంగా అభినయించే భాగ్యం కలిగినట్లయితే నా జీవితంయావత్తూనట్టువకత్తెగా గడపమన్నా చింత లేకుండా గడిపేదాన్నే. భగవంతుడు అటువంటి అనుకూల్యం కల్పించాడుగాడు. ఇతరుని భర్తగాభావించి అభినయించడమనేది మగనాలికి సామాన్యకష్టంగాదు. అదే నామనస్సులో ఉన్న బాధ. అయినా మీఆజ్ఞను పాలించడం నాకర్తవ్యం. నమస్కారం. వెళ్లుతున్నా, బిడ్డలు జాగ్ర........”అని జానకి బయలుదేరింది. వెలవెలబోవుచున్న ముఖంమీద వికృతంగా కనబడుచున్న తెచ్చికోలునవ్వుతో భార్యకు వీడ్కోలిస్తూ వరాండాలో నిలబడ్డాడు జగన్నాథం. జానకి గేటు దాటి రోడ్డుమీది కెళ్లి కారుయెక్కింది.

౬

విగ్గులు కట్టుకోవలెనా? రంగులు పూసుకోకోవలెనా? పూలు ముడుచుకోవలెనా, సొమ్ములు పెట్టుకోవలెనా, చీరె సింగారించుకోవలెనా? మగవానికైతే యీపాట్లు. వచ్చేరావడంతోటే జానకి రంగస్థలాన మెఱుపులాగ పొడసూపింది. అటు పాత్ర పోషణతూ, ఇటు సాధ్వీధర్మానికీ భంగం లేకుండా నెమ్మదిగా అభినయించడం ఆరంభించింది. నాయక పాత్రధారిగూడా ఆమెచిత్త మెఱిగి స్త్రీవేషధారులైన పురుషులతో వ్యవహరించినట్లు విచ్చలవిడిగా ప్రవర్తింపక మెలకువగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. వారిరువురి ప్రవర్తనా ప్రేక్షకులోకాన్ని రంజింపజేసింది. అయితే నాటకమంతటా ఒక్కవిధంగా అంటీముట్టకుండా ఉండటానికి సాధ్యమా? సత్యవంతుడు అడవిలో చెట్టుకొట్టాడు. పడిపోతున్నాడు. అతనిని తన కోమలకరాబ్జాలతో పట్టుకొని తొడమీద పడుకోపెట్టుకోవాలె. జానకిఒడలు జలదరించింది. ఏదో గొప్ప తప్పుపని చేయబోయే దానివలె-అలమటించింది. ఒళ్లు ముచ్చెమటలు పోసినవి. “నాపెనిమిటి సుఖంగా

ఉండగా, నేనీతన్ని తొడలమీద పడుకోబెట్టుకొని మొగమొపోయిన మగువలాగా ఏడవాలె కాబోలు" అని కన్నీరునించింది. "పురుష శాసనం రాజశాసనంకంటె కఠినమైంది. లేకపోతే నన్నీ రంగస్థలంమీద అభినయించి తీరాలెనని నాభర్త శాసించడ మేమిటి? నేను రావడ మేమిటి? ఏమి టీసబబు? దుశ్శాసనాలుగూడా అనుల్లంఘనీయాలేనా? వీటిని అతిక్రమించినా సాధ్వీధర్మానికి లోపమేనా? ఇంతకూ ఒట్టు నన్ను బంధించింది. అదైనా యితరమైంది కాదు. తనప్రాణంమీదనే పెట్టుకొన్నారు. వారి ప్రాణంకంటె నాకెక్కువైందేమిటి? అందుకే యీనీచకృత్యాని కొప్పుకున్నా. ఈశ్వరుడు నాపతికి దీర్ఘాయు విచ్చుగాక. ఈ ఓగాయిత్యం నన్నంటకుండునుగాక." అని అనుకుంటూ, అశ్రువులు విడుస్తూ విధిలేక జానకి అంటే సావిత్రి సత్యవంతుణ్ణి తన తొడలపై చేర్చుకున్నది. ఆసమయంలో ప్రేక్షకులకు కావాలసిందేమిటి? బాగా యేడవడమే. ఏకారణంచేతనైతేనేమి ఆదుఃఖరసం బాగా పోషించి ప్రేక్షకుల మెప్పుపొందింది జానకి. ఇంతలో యముడు వచ్చాడు. సత్యవంతుని నెమ్మదిగా ఊరువులమీదనుంచీ దిగిచి యముడికి నమస్కారంచేసింది సావిత్రి. ఆపై సావిత్రీయముల సంభాషణ ప్రేక్షకుల నత్యంతంగా ఆకర్షించింది. తన కళావైదగ్ధ్యమంతా గుప్పించింది జానకి యీరంగంలో.

౨

జానకి నాటకశాలకు వెళ్లిన కొంచెం సేపటికే బాబు లేచాడు. తల్లికోసం నాల్గువైపులా చూచాడు. తల్లి కనపడలేదు. ఏడ్చాడు. ఆఏడ్పుకు ఉయ్యాల కిందనే పడుకున్న అచ్చికి మెలకువ రాలేదుగాని ఆందోళనగా పడుకున్న జగన్నాథానికి చప్పున మెలకువ వచ్చింది. చివాలున లేచి బిడ్డను చేతికి తీసుకున్నాడు. "బాబూ, ఏడువకు" అని బుజ్జగిస్తూ బుజాన వేసుకున్నాడు. కాని తలవంచి బుజాన పడుకోలేదు బాబు. పాముపడిగలాగా తలెత్తి నాల్గు వంకలా చూస్తాడు; నాన్న వంక చూస్తాడు; ఏడుస్తాడు. ఎన్నివిధాల ఊరడించినా బాబు యేడ్పుమానలేదు. ఇక ఓదార్చడం చేతగాక జగన్నాథం అచ్చిని లేపాడు. అదీ కష్టమే. ఒకగంటసేపు లేపగా లేపగా కళ్లునులుముకుంటూ లేచి పిల్లవాణ్ణి యెత్తుకున్నది; చల్లగాలిలో అటూయిటూ తిప్పింది. ఆటవస్తువులు చూపించింది; ఉయ్యాల్లో వేసి ఊపింది; ఏంజేసినా బాబు యేడ్పుమానలేదు. "పోనీ, పాలుపోస్తాను ఉండవే; ఆకలై యేడుస్తున్నాడేమో" నని జగన్నాథం గ్లాక్సో డబ్బి, వేడినీళ్ల సీసా, వెండిగిన్నె, చెంచా, కొమ్ము చెంబూ అన్నీ పోగేసుకుని కూర్చున్నాడు. కాని యెంతపిండో, ఎన్నినీళ్లో, ఎట్లా కలపాలో, ఏమీ తెలియదు. ఒకమాటు కలిపాడు. పాలు నీళ్లలాగున్నాయి. నీళ్లెక్కువైనాయి అనుకున్నాడు. ఇంకా కొంచెం పిండిపోశాడు. "అయ్యో! ఈమాటు పాలు చిక్కనైనాయే" అనుకున్నాడు. మళ్లీ కొంచెంనీళ్లు పోశాడు. మళ్లీ కొంచెం పిండి వేశాడు. అటుచేసి, యిటుచేసి పెద్దగిన్నెడుపాలైనాయిగాని మనస్సుకు సమాధానంలేదు. మనసులో యేదో ఆందోళనా, అవతల పిల్లవాడి యేడుపూ, పాలు యేతీరున కలపాలో తెలియకపోవడం—ఏదో కంగారుపడుతూ చెరిసగం పాలు క్రిందపోస్తూ పాలుతయారుచేశాడు జగన్నాథం. కాని పోయడమెట్లా? తల్లిపాలకు అలవాటుపడ్డ పిల్లలు డబ్బీ పాలు మూమూస్తారా? బాబును తొడమీద కూర్చొబెట్టుకొని కొమ్ముచెంబులో పాలుపోసి కొమ్ముకు పీక బెట్టి నోట్లో బెట్టి త్రాగించబోయినాడు. వాటిముఖం ఎప్పుడూ చూడని బాబు నోరు గట్టిగా మూసుకొని కొమ్ముచెంబు చేత్తో తోశేసి పెద్దగా యేడవడం మొదలుపెట్టాడు. పోనీ పీకతో త్రాగడేమోనని గిన్నెలో పోసి యిచ్చాడు. అదీ నెట్టేశాడు. "ఇదిగాదు త్రోవ. కాళ్లమీదవేసుకొని పోస్తా ఉండూ" అని జగన్నాథం పిల్లవాడిని కాళ్లమీద వేసుకొని స్పూనుతో పాలు నోట్లో పోయబోయినాడు. కాళ్లూచేతులూ విసురుకుంటూ గిలగిలా కొట్టుకొని నోట్లో పోసిన పాలు తెమడచేసి కక్కడం మొదలుపెట్టాడు బాబు. చేతితో తోసివెయ్యడంచేత గిన్నె, చెంచా అంతదూరాన

పోయి పడ్డాయి. కాలివిసురుకు థర్మాసుఫ్లాసుక్క నేలబడి ముక్కలుముక్క లైపోయింది. జగన్నాథానికి పట్టరాని కోపం వచ్చింది; సహనం కోల్పోయినాడు. 'పసివాడే తాళుతాడా' అనుకోకుండా ఛెళ్లున వీపుమీద ఒకదెబ్బ వేశాడు బాబును. ఆదెబ్బకు బాబు కేరుమని ఒక్కబొప్పపెట్టి వెన్ను విల్లువంపుగా వంచుకొని యేడ్చి యెటుచూచినా తల్లి కనిపించకపోవడం చేత మళ్లీ తండ్రికాళ్లకే చుట్టుకున్నాడు. ఆపిల్లవాడిని చూచేసరికి జగన్నాథంకడుపు తరుక్కపోయింది. కన్నులవెంట నీళ్లు జొటజొటా వచ్చాయి. బిడ్డను ఛప్పున చేతులకు తీసుకొని "నాయనా, ఎంత దుర్మార్గుణ్ణిరా, ఈపాడుచేతులతో యెంతదెబ్బ కొట్టానురా." అని గుండెలకు అదుముకున్నాడు. "నీ తల్లి నీసొత్తు నీతల్లి దగ్గర నీవు పాలుత్రాగడం నీజన్మహక్కు. నీహక్కును నేను భంగపుచ్చినప్పుడు నీ వీమాత్రం పోరాడడం తప్పా? బాబూ, తప్పుచేశాను. ఏడవకు, నాన్నా! ఏడవకు. అదిగో రెండుగంటలైంది. మీ అమ్మ వస్తుంది. బొజ్జనిండా పాలిస్తుంది" అని బుజ్జగిస్తూ పిల్లవాణ్ణి బుజాన వేసుకొని వరాండాలో పచారు చేయడం మొదలుపెట్టాడు. ఎన్నడూ యెఱుగని అయ్యగారికోపం, చీకాకూ, గడబిడా చూచి హడిలిపోయి అచ్చి గోడ కంటుకుంది.

౫

పసిబిడ్డతల్లికి తలమునకలపనిలో ఉన్నా బిడ్డమీదనే కన్ను. ఉత్సవానికి పోనీ, ఊరేగింపుకు పోనీ, పెత్తనానికి పోనీ, పేరంటానికి పోనీ, కూలికి పోనీ, కూటికి పోనీ, ఒక్కక్షణం నిలువదు. 'పాలుత్రాగే బిడ్డను వదిలివచ్చాను యింట్లో. ఒక్కక్షణం నిలవడానికి లేదు పోవాలె, పోవాలె. బిడ్డ కక్కటిల్లిపోతుండాలె, గొంతెండిపోతుందేమో,' ఇదే ఆత్రం. జానకి ప్రాణంగూడా యిట్లాగే తపించిపోతున్నది. ఆమె ప్రాణమంతా బాబువద్దా, బొందిమాత్రం రంగస్థలంలో. నాటకం యెట్లాగో ముగించేసి మంగళగీతం పాడుతుండగానే కారెక్కి వచ్చేసింది జానకి. జగన్నాథం యింకా పిల్లవాణ్ణి బుజాన వేసుకొని చిచ్చికొడ్తూ పచారుచేస్తునే ఉన్నాడు. జానకి భర్తను చూడగానే "ఏమి? యెత్తుకొని తిప్పుతున్నారే? ఏడుస్తున్నాడా?" అంటూ బిడ్డను చేతికి తీసుకున్నది. "అనుకుంటూనే ఉన్నా, పిల్లవాడు లేచి యేడుస్తున్నాడేమో, వేసంకాలమే, గొంతెండుతుందే అని. తొందరతొందరగా వద్దామన్నా వీలుకాలేదు. ఏమిబాబు, అర్ధరాత్రివేళ నాన్నగారిని వేధిస్తున్నావా?" అని యేమేమో బుజ్జగింపు మాటలాడుతూ పిల్లవాడికి పాలివ్వడం మొదలుపెట్టింది జానకి. ఆయేడుపూ, ఆయెక్కు, ఆపెంకితనం అంతా ఏమైపోయిందో కిలకిలా నవ్వుకుంటూ కాళ్లూచేతులూ ఆడించుకుంటూ మహాసంతోషంతో పాలుత్రాగడం ఆరంభించాడుబాబు. ఆమాతాశిశువుల, అవిచ్ఛేద్యమైనసంబంధం, ఆతల్లియొక్క ఆత్రం, ఆ బిడ్డయొక్క ఆనందం చూచి 'సంసారంలో అనుభవపూర్వకంగా నేర్చుకోవలసింది చాలా వుంది. ఊహాప్రపంచంలో సులభంగా యేర్పఱచుకొన్న యేర్పాట్లు క్రియాప్రపంచంలోకి తేవడం సామాన్యకార్యం గాదు' అనుకున్నాడు జగన్నాథం.

బిడ్డకు పాలిచ్చుకుంటూ అకల్మషురాలగు జానకి "బాబు నేను వెళ్లంగానే లేచాడా? పాలుపోశారా? త్రాగాడా? ఏమి నిద్రపోలేదూ?" అంటూ పెనిమిటిని యెన్నోప్రశ్నలు వేసింది. విసుగునో, సిగ్గునో జగన్నాథం సరిగా జబాబుచెప్పలేదు. కాని జానకి యింట్లోకి వెళ్లంగానే కలిపినపాలగిన్నెలూ, ఒలికిన పాలూ, పగిలిన వేడినీళ్ల సీసా, మొదలైన వన్నీ బాబుచేసిన అల్లరీ, పెనిమిటిబడ్డ పాట్లూ చెప్పకుండా చెప్పినవి. తనభర్త చాలా శ్రమపడ్డాడుకాబోలునని విచారించింది జానకి.

౬

మఱునాడు కళాసంఘంవారు తమ యేర్పాటు ప్రకారం యేలూరు వెళ్లారు. పాదుకాపట్టాభిషేక ప్రదర్శనానికి సర్వసన్నాహాలూ పూర్తిఅయినాయి. దానిలో జానకి కైకవేషం వెయ్యాలె. శాశ్వతంగా లోకనిందకు పాత్రలైన స్త్రీలలో కైక అగ్రగణ్య

రాలు. సరళస్వభావయగు జానకికి కైకాపాత్రధారణం దుస్సహమనిపించింది. అయినా తప్పే దేమున్నది? తన ప్రాణేశ్వరున కొసగిన వాగ్దానం చెల్లించుకోవాలెగదా. ఆక్రిందటిరాత్రి బాబుతో పడ్డ కష్టం తలచి జగన్నాథం భార్యను నాటకానికి పంపకమంటే భయపడ్డాడుకాని కాదంటే సమితివారిచే మాటవస్తుందనీ, మిత్రులు అపహాస్యం చేస్తారనీ అనుకొని మాట్లాడకుండా వూరుకున్నాడు. మామూలుగా తొమ్మిదిగంటలకు జానకి నాటకశాలకు వెళ్లింది. హోటలునుంచి అన్నంరావడం ఆలస్యమైనందున అన్నంతినకుండానే నిద్రపోయిన లీల తల్లి అట్లా వెళ్లగానే నిద్రలేచి "నాన్నా, మాఅమ్మేదీ" అన్నది.

"అట్లా వెళ్లింది. వస్తుంది. ఏమి ఆకలేస్తున్నదా? అన్నంపెట్టనా" అన్నాడు తండ్రి.

"అమ్మచేత పెట్టించుకుంటా."

"అమ్మ యిప్పుడు రాదు."

"అమ్మదగ్గిరికి పోతా."

"అమ్మ దొడ్లోకి వెళ్లింది."

"నాకూ దొడ్డికి వస్తున్నది."

"వస్తే అచ్చి అరుగుక్రిందికి తీసుకుపోతుంది పో."

"అయితే రాటంలే; మాఅమ్మేదీ?"

"మీఅమ్మ యెక్కడికో పోయింది."

"అయితే నాకు బువ్వ యెవరు పెట్టుతారు?"

"నేను."

'ఛీ! నాన్నలు బువ్వపెడ్తారా, ఎక్కడన్నా?"

"పెడ్తారులే, రా"

"ఊఁ హూఁ. నాకు అమ్మే కావాలె."

లీల సన్నగా యేడ్వసాగించింది. ఆసడికి బాబుగూడా లేచి యేడ్వసాగిస్తాడేమోనని భయపడి జగన్నాథం లీలకు రెండుచేతుల్లో రెండు బిస్కట్లు పెట్టి, వేడిపాలల్లో కొంచెం కలకండపొడి వేసి త్రాగించి ఎత్తుకొనితిరగడం ప్రారంభించాడు. బాబు చేసినంత ఆగం చేయకపోయినా లీల మాటిమాటికీ "మాఅమ్మేదీ?" "మాఅమ్మేదీ" అని అడుగుతూ యేవేవో ప్రశ్నలు వేస్తూ తండ్రిని విసిగించి వదిలిపెట్టింది. లీలతోనే విసుగుతూఉండగా ఒంటిగంట అయ్యేసరికి బాబుగూడా నిద్రలేచాడు. లేచాడా అంటే, తారాజువ్వ; చంకకు రాడు; చేతిలో ఉండడు; ఉయ్యాల్లో పండుకోడు; పాలుపట్టితే త్రాగడు. జగన్నాథం లీలను దించి బాబును యెత్తుకున్నాడు. అదవటకే ఏడవటానికి చూస్తున్న లీల తండ్రి క్రిందికి దించిన అవకాశం చూచుకొని బ్యారుమని యేడవటం మొదలుపెట్టింది. పోరుపెట్టి యేడవటంలో పూర్ణప్రజ్ఞుడనిపించుకున్న బాబు అక్కకు సాయమైనాడు. ఒక్క నేరస్తుణ్ణి యిద్దరు అధికారులు ఒక్కమాటే శిక్షించడానికి పూనుకున్నప్పుడు పాపం, ఎంతసహనంగల అపరాధిఅయినా ఏమిచేస్తాడు? పాపం, యేడ్చేపిల్లలిద్దటి మధ్యా జగన్నాథం నిర్వికారంగా నిలబడ్డాడు. వాళ్లను యెట్లా ఓదార్చాలో ఆతనికి తెలియలేదు. 'ఒకొక్కక్క తల్లి అయిదాఱుగురు బిడ్డలను సులభంగా సముదాయించుకుంటుంది. ఆహా! మాతృమూర్తియందెట్టి సహనసామర్థ్యాలు గర్భితమై యున్నవో! ఆశ్చర్యం! పురుషుడీవిషయంలో ప్రకృతమపాశమైనా వల్లించి ఉండలేడు.' అని యేవేవో భావాలు అతని హృదయాకాశాన జ్యోతిష్మతీలతలవలె మెఱవడం మొదలుపెట్టినాయి. కాని మాతాపితల సామర్థ్యాసామర్థ్యాలు విచారించి చర్చించి పర్యవసానం తేల్చుకోడానికదిసమయమా? తండ్రి యెత్తుకున్నా నిలవకుండా బాబు యేడుస్తుంటే "నన్నుకూడా యెత్తుకో" మని కాళ్లకు చేతులు మెలివేసి నిలబెట్టింది లీల. లీల చేస్తున్న మంకుతనానికి ఒక్కదెబ్బ వేద్దామా అనిపించింది జగన్నాథానికి. కాని ఆక్రిందటిరోజున బాబును కొట్టినందుకే పశ్చాత్తాపపడుతున్నాడుగనుక లీలను కొట్టటానికి చెయ్యిరాలేదు. వాళ్లతల్లిని వాళ్లదగ్గిర లేకుండా చేసిన దోషం తనదైనప్పుడు ఎట్లా కొడ్తాడు?

"నానీ! నిన్ను అప్పి యెత్తుకుంటుంది. ఏడవకు. నామాట వినవూ? నీకు బొమ్మలూ, మిఠాయిలూ కొనిపెట్టవద్దూ?"

"కొత్తచొక్కాలో?"

"ఆఁ. కొత్తచొక్కాలూనూ?"

"బొమ్మలబొక్కో?"

"అదిగూడా. అన్నీ కొనిపెడ్తా, ఏడవకుండా ఉంటే."

"ఏడవను, అమ్మను చూపించూ."

"అదిగో రెండుగంటలైంది. మీ అమ్మ కారెక్కి వస్తుంది."

"ఎక్కడకు పోయిందీ?"

"బజారుకి."

"నన్ను తీసుకుపోలే దేం?"

"తమ్ముడూ, నీవూ దోబూచులాడుకోండీ."

గేటువద్ద హారన్ ధ్వని వినపడ్డది. "నాన్నా, కారొచ్చింది. అమ్మ రాలేదేం?"

"అదిగో వస్తున్నది చూడూ."

"ఆఁ, ఆఁ, అదిగో, అదిగో అమ్మ వస్తున్నది. అమ్మ వస్తున్నది." అని లీల చప్పట్లుకొట్టుతున్నది. బాబు ఏడుపంతా మాని కిలకిలా నవ్వుతూ అక్కతో బాటు చప్పట్లుకొట్టుతున్నాడు. మహోల్లాసంతో బిడ్డలిద్దఱూ స్వాగతమిస్తూ ఉండగా జానకి వరండాచీడీ లెక్కింది బాబు చేతుల్లోకి దూకాడు. జానకి అక్కడే గోడనానుకొని కూర్చున్నది. తల్లి మెడలోని స్వర్ణహారాలు చేతులతో లాగుతూ కాళ్లూపుతూ బాబు పాలు త్రాగుతుంటే "నన్ను తీసుకపోకుండా నీ వెందుకు బజారుకు పోయినావు, చెప్పూ" అని మారాముచేస్తూ ప్రక్కనుంచీ తల్లిభుజముపై తలమోపి రుద్దుతున్నది లీల. జగన్నాథం ఆవిచిత్రం చూస్తూ తెల్లబోయి నిలబడ్డాడు.

౧౦

మూడవఆటకు నాటకసంఘంవారు రాజమండ్రి చేరారు. జమీందారుగారి బంగాళాలో వారి విడిది. ఆనాటినాటకం సారంగధర. జానకి ఆనాడు చిత్రాంగి వేషం వెయ్యాలె. సారంగధరనాటకం చూచే ప్రతివారికీ తప్పెవరి దనేసందేహం తప్పకుండా కలిగితీరుతుంది. న్యాయం, రాజరాజనరేంద్రుడిదే ముమ్మాటికీ తప్పంటుంది. నీతి చిత్రాంగిదే తప్పంటుంది. అయితే కొడుకుపటం చూపి తాను పెండ్లాడిన రాజరాజనరేంద్రుని దుష్కృత్యాన్ని ఎవరూ అనుకోరు. తాను రూపపటమందు చూచిన యువకునియందే అనురాగం కలిగిఉండిన చిత్రాంగిని దూషిస్తుంది లోకం. మానవజీవితంలో నీతి అతిప్రాముఖ్యమైన విషయం. నీతిని విడనాడి ఎవరు ఎంతటివారు లోకంలో మంచివా రనుపించుకోలేరు. మానవుల జీవితోన్నతి నీతిమాత్రంచేత నిబద్ధమైఉన్నది. అది ఒక్కొక్కపట్టులో అవలంబించడానికికష్టమైనప్పటికీ విడవడానికి వీలుగానిది. కాబట్టే చిత్రాంగి లోకదూషణకు గురైంది. "రాజరాజనరేంద్రుడు చేసింది తప్పేఅనుకో, అయిందేమో అయింది, తాను నీతిగా ఉండరాదూ," చిత్రాంగిని లోకం మందలించే దందుకు. కనుక లోకంలో పవిత్రమైన నీతికి ప్రాముఖ్యత ఉన్నన్నాళ్లూ చిత్రాంగి మంచిదనబడదు. అందులో గోరంతలు కొండంతలుగా వ్రాయ నలవాటుపడ్డ మనకవులు తమ వెఱ్ఱిమొఱ్ఱివర్ణనలతో చిత్రాంగికి మఱీమాలిన్యం కలిగించారు. కాబట్టే లోకంలో విలాసాతివిలాసంగా తిరిగే దుర్జాతిస్త్రీలను 'అదొక చిత్రాంగి' అనడం లోకసాధారణం అయిపోయింది. శ్రవ్యకావ్యాల్లో చిత్రాంగిదౌష్ట్యం ఎంత హద్దుమీరినా భయంలేదుకాని దృశ్యకావ్యాల్లో చిత్రాంగిమోహవ్యవహారం హద్దుమీరించడం నటకులకు ప్రాణకంటకం. అందులో ఒక కులాంగన ఆపాత్రధారణంచెయ్యాలంటే అదిసామాన్యమైన కష్టంగాదు. చిత్రాంగిపార్టు వల్లించిందేగాని దానినిఅభినయించడ మెల్లాగని జానకి లోలోపల క్షోభిల్లిపోతున్నది. పరమసాధుశీలుడగు నొకపురుషుని తానే ప్రణయవ్యవహారాలకు ప్రేరేపించుతూ నానా అసభ్య

క్రియలూ చెయ్యాలె. ఒక మానవతి యీపాత్రధారణం చెయ్యడ మెట్లా? సారంగధరలో ఆశయాశ్రయంలోని ప్రతిపదమూ జానకిప్రాణాన్ని ఆర్చివేస్తున్నది. క్షుభితసాగరంవలె ఉన్న హృదయంతో "ఆయనవద్దు అనేవఱకు నే నీ నీచకృత్యం చేయకతప్పదు. నే నేమి చేయను? ఆ ఒట్టు నన్ను కట్టివేసింది. ఇది నాపతివ్రతాధర్మాల్లో ఒకధర్మాచరణం. దీనివల్ల నా నిర్మలశీలానికి యొగ్గు రాకుండుగాక. నా సర్వస్వం భర్తకు సమర్పించాను. ఈశరీరం ఆయనదికాని నాది కాదు. కాబట్టి యీతనువును ఆయన యెన్నెన్నివిధాల వినియోగించుకొని ఆనందించాలంటే అన్నన్నివిధాలా వినియోగపడి ఆయనను సంతోషపెట్టడమే నాధర్మం" అని తాము బసచేసిన బంగాళావరండాలో కూర్చొని ఆలోచిస్తున్నది జానకి.

జగన్నాథంగూడా ఆవరండాలోనే జానకికి సమీపంగానే పచారుచేస్తున్నాడు. అతనూ భార్యవంక చూస్తున్నాడు; యేమో ఆలోచిస్తున్నాడు; జానకి మామూలుగా లేదని తెలుసుకున్నాడు; బహుశా నాటి చిత్రాంగి పాత్రాభినయమే ఆమెను కలవరపెట్టుతున్నట్టుందనిగూడా గ్రహించాడు. "జానకికి చాలా మనోవ్యధ కలిగిస్తున్నా"ననిగూడా అతనికి తోచింది. తన్ను సర్వవిధాలా పోషించి రక్షిస్తాడనేగదా స్త్రీ తన్ను పురుషునికి సమర్పించుకుంటుంది. ఆవిధంగా తన్నే నమ్ముకున్న సతిని పురుషుడిట్టి అనుచితకార్యములకు వినియోగింపవచ్చునా? ఇది పురుషుడు తన భర్తృత్వాధికారం దుర్వినియోగం చేయడంకాదా? అయిందేమో అయింది. ఇంతటితో మానివేస్తే ఏమి? తీర్మానం తెచ్చింది తాను; నెగ్గించింది తాను; ఆచరణలో పెట్టిందితాను; ఇప్పుడు వెనకతీసిందిగూడా తానేఅయితే నల్గురూ నవ్వరూ? కాని "వాళ్ల నవ్వుకోసం నాభార్యనిట్లా యెంతాకాలం హింసించేది? బిడ్డల నెన్నాళ్లు అల్లాడపెట్టేది? నే నెన్నాళ్లు అవస్థపడేది? అబ్బా! ఒక్కొకరాత్రి వేగించేటప్పటికి తలప్రాణం తోకకు వస్తున్నదే! పిల్లలు చెడిపొయ్యేటట్లున్నారే! జానకిగూడా నిద్ర లేకపోవడంచేత కాబోలు, శిరోవేదనతో బాధపడుతున్నదే! ఏమిటీఘోరం! నాకళోన్మాదానికి నాభార్యాబిడ్డలను బలిపెట్టనా?" అని యోచిస్తున్నాడు జగన్నాథం. ఇంతలో "అబ్బాయిగా రేడుస్తున్నారండీ; ఎంత ఊరుకోబెట్టినా ఊరుకోడం లేదండీ; ఒళ్లుగూడా వెచ్చగా ఉందండీ," అంటూ అచ్చి పిల్లవాడిని జానకివద్దకు తీసుకవస్తూ అన్నమాట జానకీజగన్నాథులచెవుల్లో ఒక్కమాఱుగా చుఱుక్కున తగిలింది. "ఏమే, ఒళ్లు వెచ్చబడ్డదా?" అంటూ ఆత్రంతో బిడ్డను చేతికి తీసుకుంది జానకి. జగన్నాథం జానకి బిడ్డను చేతికి తీసుకుంటూ ఉండగానే తటాలున వచ్చి పిల్లవాని ఒంటిపై చెయ్యిపెట్టి చూచి "ఆఁ. జ్వరమే. ఒళ్లు బాగా వెచ్చగా ఉంది." అన్నాడు నెమ్మదిగా దిగులుతో.

"ఎండలూ, ప్రయాణం, ఊరి ఊరి నీళ్లు త్రాగడం; పిల్లవాడికి జబ్బుచేస్తుందని అనుకుంటూనే ఉన్నా. అట్లాగే జరిగింది."

"రాత్రిళ్లు నిద్రగూడా లేదు."

"నిజమే."

"రాత్రికి నీవు ఆటకు వెళ్లాలిగా?"

"వెళ్లొద్దూ?"

"పిల్లవాడిని పట్టుకోడం కష్టమేమో?"

"ఆఁ, కష్టమే."

"అయితే ఈపూట ఆటకు వెళ్లడం మానితే సరి."

"సర్వ సన్నాహాలు చేసుకొని ఊరంతా ప్రకటనపత్రాలు పంచి మూడురోజులనుండీ టిక్కట్లు అమ్ముతూ ఇప్పుడు మానితే బాగుంటుందా? ఎంత గోల అవుతుంది?"

చిన్నబోయిన ముఖంతో ఆకాశంవంక చూస్తూ "ఇది మూడో ఆట" అన్నాడు జగన్నాథం భారంగా.

"అవును, ఈరాత్రి ఎట్లాగో గడిపితే" అన్నది జానకి.

౧౧

రాత్రి, తొమ్మిదిన్నరగంటలకు యథాప్రకారంగా జానకిని నాటకశాలకు తీసుకపోవడానికి కారు వచ్చింది. ఎంతధైర్యం తెచ్చుకున్నా జానకికి నాటకశాలకు పోవడానికి కాళ్లాడలేదు. ముమ్మారు లోపలికి పోయి, ముమ్మారు బయటికి వచ్చింది. పిల్లవాడిని పట్టి పట్టి చూచింది. బిడ్డ ఉలిక్కి ఉలిక్కి పడుతున్నాడు. కలవరిస్తున్నాడు. "జ్వరం తీవ్రంగా ఉన్నది. ఎట్లా వదిలిపెట్టిపోను" అనుకున్నది. కన్నులు తడిఅయితే పైటచెరుగుతో తుడుచుకున్నది. పెనిమిటివంక చూచింది. "ఎందుకు ఆలస్యం చేస్తావు!" అన్నాడు జగన్నాథం.

"ఏమీ లేదు. కాక తగిలితే పిల్లలు ఆదమఱచి నిద్ర పోరు. పోరుపెట్టి యేడుస్తారు. మీరు యెట్లా ఓదారుస్తారా అని సందేహిస్తున్నా."

"భయం లేదు. ఏదోవిధంగా చూస్తా పో."

"ఈరాత్రి కారు యిక్కడే ఉంటుంది. బాబు లేచి ఏడిస్తే కారు పంపించండి, తత్క్షణం వస్తా."

"అప్పుడు నీవు రాజరాజ నరేంద్రుడిమహలులో ఉంటావేమో."

"ఆమహలుకు పంపించింది మీరేగా? మీఒట్టే నాకు చరణశృంఖల కాకపోతే నాచిన్నిబాబును ఈ సమయంలో విడవమన్నా విడుతునా? నాబిడ్డను చూచుకోడంకంటే నాట్యరంగం నా కెక్కువగాదు. ఈబొంది యెక్కడ ఉన్నా నేను మీఅంతరంగంలో నే" అన్నది జానకి. జగన్నాథం సిగ్గుతో మారుమాట్లాడకుండా తల నేలకు వంచుకున్నాడు. జానకి వెళ్లి కారు యెక్కింది.

౧౨

నాటకశాలకు వచ్చిందన్నమాటేగాని జానకికి మనసులోమనసు లేదు. తన ప్రియపుత్రుడైన బాబుకు జ్వరంరావడం, తాను దుష్టమైన చిత్రాంగిపాత్రధారణ చేయవలసియుండడం, రెండూ రెండు అంపాలలాగా ఆమెహృదయాన్ని కోసివేస్తున్నవి. సారంగధరనాటకంలోని ఆవలపుగీతాలు, ఆవిరహవాక్యాలు తలుచుకుంటే ఆమెకు శరీరం కంపరమెత్తిపోతున్నది; అవయవాలు పట్టుతప్పిపోతున్నవి. ఎట్లాఉన్నా కర్తవ్యంఒకటి ముందుకు నెట్టడంచేత ఎలాగో కాళ్లునిలవత్రొక్కుకొని స్టేజీ మీది కొచ్చింది. పద్యంవంతు వచ్చింది. ఆరంభించింది.

చ. అనదవిధంబు వాటిలె
    ననంగుని బారి......కి...నో......జాలనీ
యెనిమిదినాళ్లు నొక్కగతి
    నేస్చుచు బాపితి నింక దా.........నా
మనసిజరూపవైభవుని
    మానవతీనవమోహనాంగునిన్
దినకరతేజునిన్ విభవ
    దివ్యబిడౌజునిగా............

అనిపాడింది. సాధ్వీధర్మానికి కళంకందెచ్చే ప్రత్యక్షరం జానకినోట వెలువడక అప్రయత్నంగా లుప్తమైపోయింది. జానకి పద్యపఠనావైఖరి ప్రేక్షకులకు అసహ్యమైపోయింది. "ఇంత తెత్తెరేఅనేదానవు రంగాని కెందు కొచ్చావు? ఏ" అని అరుస్తూ జనమంతా గొల్లున గోలెత్తి చప్పట్లుకొట్టారు. జానకి తలపై పిడుగుపడ్డట్లయింది. నిర్ఘాంతపోయి నిర్జీవప్రతిమలాగా అయిపోయింది. కొంతసేపటికిగాని కళ్లవెంటనైనా నీళ్లురాలేదు. తల నేలకు వంచుకుంది. కన్నీళ్లు జొటజొట నేలమీద పడుతున్నాయి. తిన్నగా నేపథ్యంలోకి వెళ్లిపోయింది. "వారంరోజులు నుంచీ పత్రికలు ఈమె అభినయాన్ని గురించి పడ వ్రాస్తుంటే వచ్చాము. ఆవ్రాసినవాళ్లెవరూ ఈమె అభినయం చూచినట్టులేదు. అయ్యో? అర్ధరూపాయి దండుగ రూపాయి నష్టం. మూడురూపాయలు పాడు. ఇవ్వాళ మాకుటుంబానికంతా మొత్తం టిక్కట్లక్రింద ఇరవైరూపాయలు మసి" అని యెవరుపెట్టిన దండుగ వాళ్లు ఏకరువు పెట్టుకుంటున్నారు; ఈలలు వేస్తున్నారు; చప్పట్లు కొట్టుతున్నారు. "ఆట ఆపేశారా! అయితే మాడబ్బు పారేయం" డంటున్నారు. తక్కువరకం టిక్కట్లు కొన్నవాళ్లే ఎక్కువ అల్లరి చేస్తున్నారు.

"గింగట్లో అన్నం పెట్టుకొని వెంద్రుకలు వచ్చినాయని అసహ్యపడితే ప్రయోజన మేమిటి" అనుకొని ప్రేక్షకుల అల్లరిచే కడు నొచ్చిపోయిన జానకి ఎట్లాగో కొంచెం ధైర్యం తెచ్చుకొని మళ్లీ స్టేజీమీదికొచ్చింది. కాని ఆ అసభ్యపదా లుచ్చరింపలేక మాటిమాటికి నాలుక యెదురు తిరుగుతునే ఉన్నది. ఆడియన్సు అల్లరిచేస్తునేఉన్నారు.

" మెల్లగా బయటికివచ్చి...నిద్రపోతున్న డ్రైవరును లేపి... "

౧౩

బాబుకు నిద్రలేదు. క్షణక్షణానికి జ్వరం హెచ్చిపోతున్నది. కొలిమితిత్తుల్లోంచి వచ్చినట్లు ముక్కుల్లోంచి వెచ్చని శ్వాస వస్తున్నది. "ఊఁ ఊఁ" అని పెద్దవాళ్లు మూలిగినట్లు మూలుగుతున్నాడు; నడుమ నడుమ ఉలికిపడుతున్నాడు; ఏడుస్తున్నాడు; జగన్నాథంగుండె లవిసిపోతున్నవి. ఆపిల్లవాడి బాధ చూడలేకుండా ఉన్నాడు. బాబుకుయెదురుగా కుర్చీవేసుకొని కూర్చోడానికిగూడా అతనికి భయమేసింది. "తల్లి దగ్గరఉంటే యేమిచేశేదో! డాక్టరును పిల్చుకొస్తామన్నా పిల్లవాడివద్ద ఉండేవా ళ్లెవరూ లేరు. ఏమిటి కర్తవ్యం?" అని క్షణమాలోచించాడు జగన్నాథం. జానకి పిల్లవాడు యెప్పుడు యేడిస్తే అప్పుడు తీసుకరమ్మన్నదికదా. ఏమైతే అదేఅవుతుంది. పిల్లవాడిని తీసుకొని అక్కడికే పోదా మనుకున్నాడు.

అచ్చీ, లీలా లోపల నిద్రబోతున్నారు. అచ్చిని లేపితే లీలగూడా లేస్తుందేమో నని భయం. అందువల్ల అచ్చినిగూడా లేపకుండా పిల్లవాడిని బుజాన పడుకో బెట్టుకొని మెల్లగా బయటికి వచ్చి తలుపులువేసి తాళం నొక్కి కారులో నిద్రబోతున్న డ్రైవరును లేపి 'కారు సిద్ధంచేయవోయి' అన్నాడు జగన్నాథం. కళ్లు నులుముకుంటూ లేచి "సిద్ధంగానే ఉన్నది మహరాజ్, దయచేయం" డన్నాడు డ్రైవరు కాసీమ్. పదినిముషాలలో కారు నాటకశాల చేరింది. ఇంతలో బాబు కొంచెం కూర్కడం చేత పిల్లవాడిని కారులో మెత్తమీద పడుకోబెట్టి "కాసీమ్, అబ్బాయిని చూస్తూఉండూ. లోపలికి పోయి పరిస్థితు లెట్లా ఉన్నాయో చూస్తా" నన్నాడు జగన్నాథం. "చిత్త" మన్నాడు కాసీమ్. జగన్నాథం లోపలికి పోయినాడు. నాటకంచూడడానికే ప్రొఫెసర్ గారు వచ్చారనుకొని "రండి, రండి," అని స్వాగత

మిచ్చారు సమితి పెద్దలందఱూ. కాని జగన్నాథం వారి స్వాగతం యేమీ అందుకోకుండానే సరాసరి వెళ్లి స్టేజీకి సమీపంగా ఉండే కుర్చీలవద్ద నిలబడ్డాడు. అప్పుడు చిత్రాంగీ సారంగధరులకు శయ్యాగృహంలో వాదప్రతి వాదాలు జరుగుతున్నవి. సారంగధరుడు "శివ, శివా" అని తొలుగుతూ ఉంటే "ప్రాణవల్లభా!" "యువతీ మదనా!" "మనో రమణా" అంటూ అతని వెంట నంటి తిరుగుతున్నది చిత్రాంగి. ఆదృశ్యం చూచేటప్పటికి జగన్నాథానికేమో ఒంటిమీద తేళ్లూ జెఱ్ఱులూ ప్రాకినట్లయింది; మనస్సు మనస్సులో లేదు; ముఖంమీది కళ తొలగింది; కన్నుల్లో తేట పోయింది. వెఱ్ఱిచూపు, వికృతాకారం అయిపోయి నిలుచున్నాడు. "సారంగా! కోమలమగు నీ శరీరము, కోమలాతి కోమలమగు నీముద్దుమాటలు! అట్టి నీ కీవజ్రహృదయ మెట్లు గలిగె? శూలములబోలు నీమాటలు నాయెద నాట నుద్యమించియు నదేమిదైవాయత్తమో కందుక ములబోలె నీ యొద్దకే యెదురేగుచున్నవి. నీయాన... నాయానన......ఆ......మ......నా న ని ను మాన జాల. నీ......యా......శ్లే......" అని యేమేమో అంటున్నది. జగన్నాథం నిబ్బరించుకోలేక పోయి నాడు. చిత్తం వశం తప్పిపోయింది. "ఆఁ, ఆఁ, జానకీ! ఎంత సాహసాని కొడిగట్టావు!" అని పెద్దబొబ్బలు పెట్టుకుంటూ అమాంతంగా స్టేజీమీదకు పరుగెత్తాడు.

హృదయవిదారకమైన ఆపలుకులు విని జానకి క్రుంగి పోయింది. కనులవెంట నీళ్లు జొట జొట కారుస్తూ గుండెమీద చేయిపెట్టుకొని "నేనా యీసాహసానికి ఒడిగట్టింది. నిజంచెప్పండీ? ఒట్టుబెట్టి వంచింది బుద్ధి పూర్వకంగా నన్ని అగ్నిగుండంలో త్రోసింది మీరు కామా" అన్నది దీనంగా. జగన్నాథం ఏమంటాడు? నేరం ఋజువైన అపరాధిలాగా అయిపోయినాడు.

*   *   *   *

*   *   *   *

కథ కంగారుగా మధ్యలో ఆపివేసి భార్యాభర్త లిద్దఱూ పూర్వోత్తరగాథలన్నీ చెప్పుకుంటూఉంటే చూస్తూ కూర్చోటానికి ప్రేక్షకులు బొమ్మరాళ్లా? రేకులతో గట్టిన నాటకశాల శిలావర్షంతో ఢణఢణా మన్నది! చెప్పులు, చేతికఱ్ఱలూ రెక్కలువచ్చినట్లు యెగిరినాయి. ఈలలూ, చప్పట్లూ, కేకలూ—ఒక టేమిటి నానాబీభత్సం! ఈప్రజాదౌర్జన్యానికి ఓపలేక సమితివారు టిక్కెట్లరుసుము ఆడియన్సుకు వాపస్ చేసి ప్రాణందక్కించుకున్నారు. ఈమహాగంధరగోళం లో జగన్నాథం యెట్లా బయటపడ్డాడో తెలియదు. కాని "పెళ్లాంచేత నాటకాలాడించడానికి వచ్చిన ఆ ప్రొఫెసర్ గారు సమితితో విడాకులుపుచ్చుకొని రాత్రే సకుటుంబంగా బండియెక్కివెడుతుపోయి" అని తెల్లవారేటప్పటికి ఊరంతా గుప్పుమన్నది.

ఆంధ్రగ్రంథమాల నూతన కుసుమము

ఆంధ్ర ఋతుసంహారము

(కాళిదాసుకృతికి అనువాదము)

అనువాదకులు: గుఱ్ఱం వేంకట సుబ్రహ్మణ్యంగారు, బి. ఎ.,

ఆంధ్రగ్రంథమాల, తపాలాపెట్టె 212, మదరాసు.